TGTEL/26/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 279 | హైదరాబాద్ | మంగళవారం | 17-03-2026 | పేజీలు: 08






## డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

- రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్
- పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం
- డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు
- ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి
- సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు
- లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్
- రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న డ్రగ్స్ వ్యవహారం

02

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- 2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు
- కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు
- మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
- విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి
- కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు
- తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత



03



# ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్

- అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం
- బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- 20 ఏళ్లలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- హైదరాబాద్ అభివృద్ధికి జీహెచ్ఎంసీని విభజన
- మూసీ నది పునరుద్ధరణకు 55 కి.మీ. అభివృద్ధి ప్రణాళిక
- రైతు భరోసా ద్వారా 65 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశాలు తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమయ్యాయి. అనంతరం వందేమాతరం, తర్వాత జాతీయ గీతం జనగణమన ఆలపించారు. ఆ తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలుగులోనే తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ రాష్ట్ర చరిత్ర, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం సుదీర్ఘ చారిత్రాత్మక పోరాటాల ఫలితంగా ఏర్పడిందని

..మిగతా 2లో

# భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

## ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం

- గత ప్రభుత్వాలపై చర్చించాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- ప్రజా ప్రభుత్వ 3వ బడ్జెట్‌కు గవర్నర్ ప్రసంగమే మార్గదర్శకం
- అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కాంగ్రెస్ సమావేశంలో చర్చ
- చర్చలు పక్కదారి పడకుండా ముందుకు వెళ్లాలని సూచన
- ఎమ్మెల్యేలు సభకు తప్పకుండా హాజరు కావాలని హెచ్చరిక
- మహిళా సభ్యులు చర్చల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపు
- ఇతర రాష్ట్రాల విధానాలు అధ్యయనం చేయాలని సూచన
- వేసవి తాగునీటి సమస్యపై ప్రజల మధ్య పనిచేయాలని ఆదేశం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్షం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి మాట్లాడటానికి ఒక హద్దు ఉంటుందని, ఇక నుంచి రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేయబోయే పనులు, అభివృద్ధి ప్రణాళికలపై సభ్యులు ఎక్కువగా మాట్లాడాలని సూచించారు.శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన

..మిగతా 2లో

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

- బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం
- బ్రిక్స్ అధ్యక్షదేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్
- అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధాల కోసమే మౌనమని ఆరోపణ
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి
- ఇరాన్‌పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు
- పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్
- విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి



03



02

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

### "తెలంగాణను ఏటీఎంగా మార్చారు"

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపణ
- 100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ
- రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి
- బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య
- మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక



## అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

- అసెంబ్లీ షెడ్యూల్‌పై హరీష్ రావు విమర్శలు
- పండుగలతో పనిదినాలు తగ్గాయని ఆరోపణ
- బడ్జెట్ చర్చకు సమయం సరిపోదన్న అభిప్రాయం
- ఆదివారం సభకు తమకు అభ్యంతరం లేదన్న హరీష్ రావు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్‌రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బడ్జెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను

..మిగతా 2లో

# భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా సీఎల్పీ సభ్యులు అభినందించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు బడ్జెట్లు ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చేసిన ప్రసంగం ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలు, అమలు చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా వివరించబడ్డాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల సభ్యులు కూడా ఆ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చలు సమర్థవంతంగా సాగేందుకు పార్టీ సభ్యుల మధ్య సమన్వయం అవసరమని సీఎం అన్నారు. ముఖ్యంగా సభలో మాట్లాడే అంశాలపై విప్‌లతో ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సభ్యులు మాట్లాడే విషయాలు పక్కదారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సభ సమయాన్ని వృథా చేయకుండా నిర్మాణాత్మక చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు ఎదురైన అనుభవాలను కూడా సీఎం గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్ష సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు. సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. జానారెడ్డి వంటి సీనియర్ నాయకులకు కూడా మైక్ ఇవ్వకుండా సభ నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. తనను కూడా ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సభకు రాకుండా చేసిన సంఘటనలను ఆయన ప్రస్తావించారు.అలాంటి పరిస్థితులు ఇప్పుడు ఉండకూడదని సీఎం అన్నారు. ప్రజాస్వామ్య విధానాలను గౌరవిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సభలో ప్రతిపక్షం కూడా మాట్లాడే అవకాశం పొందాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే సభలో చర్చలు సజావుగా సాగేందుకు సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించకూడదని సీఎం హెచ్చరించారు. ప్రతి సభ్యుడు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలని అన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులు కూడా చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన సూచించారు. మహిళా సభ్యుల అభిప్రాయాలు సభలో ప్రతిఫలించడం అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై మహిళా సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. అసెంబ్లీ కమిటీల ఏర్పాటు గురించి కూడా సీఎం మాట్లాడారు. శాసనసభ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. కమిటీల ద్వారా ప్రభుత్వ విధానాల అమలును పరిశీలించవచ్చని చెప్పారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న మంచి కార్యక్రమాలను తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని సీఎం అన్నారు. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం కన్నా వ్యవస్థను బలపర్చడం ముఖ్యం అని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు రాజకీయ వ్యవస్థను దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవస్థ బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుందని అన్నారు. పార్టీ మరియు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సభ్యులు స్పందించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు.

ఇప్పుడు ప్రభుత్వం రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలు భవిష్యత్తు ఎన్నికలకు కూడా కీలకంగా మారతాయని సీఎం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందిస్తున్న రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుంచాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్ల ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.వేసవి కాలం నేపథ్యంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సీఎం సభ్యులకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా స్థానికంగా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు.మొత్తంగా ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ విధానాల ప్రచారం వంటి అంశాలపై సభ్యులు దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# “ప్రపంచ దిక్సూచిగా తెలంగాణ”

మొదటిపేజీ తరువాయి



గవర్నర్ గుర్తుచేశారు. ఈ రాష్ట్ర నిర్మాణం కోసం అనేక మంది ప్రజలు త్యాగాలు చేశారని అన్నారు. ఆ త్యాగాలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా పాలన స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమాన అవకాశాలు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పరిపాలన సాగుతోందని అన్నారు. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా గుర్తింపు పొందే రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ వివరించారు. అలాగే 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం పలు రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని చెప్పారు. గత సంవత్సరం కాలంలో ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు చేపట్టిందని గవర్నర్ గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి పునాదులు వేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధిపై కూడా గవర్నర్ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని తెలిపారు. ఇది పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకున్న నిర్ణయం అని చెప్పారు.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా నగరం మధ్యలో ఉన్న పరిశ్రమలను నగర శివార్లకు తరలించే చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఇందుకోసం హిల్ట్ పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించామని వివరించారు.

రోడ్ల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని గవర్నర్ చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ మరియు రీజినల్ రింగ్ రోడ్ మధ్య అనుసంధానం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.అలాగే తెలంగాణను ఇతర రాష్ట్రాలతో అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం కూడా జరుగుతోందని గవర్నర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతితో కనెక్టివిటీ కల్పించేలా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనివల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

శంషాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉందని గవర్నర్ చెప్పారు. రాష్ట్రంలో విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయడానికి వరంగల్ మరియు ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.హైదరాబాద్ పరిసరాల్లో అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును కూడా గవర్నర్ ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక అథారిటీని గత సంవత్సరం మార్చి నెలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

మూసీ నది అభివృద్ధి ప్రణాళికను కూడా గవర్నర్ వివరించారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నది పునరుద్ధరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా నదిని శుభ్రపరచడం, పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గవర్నర్ అన్నారు. ప్రజలకు భద్రత కల్పించేందుకు నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

సామాజిక న్యాయం అంశంపై కూడా గవర్నర్ ప్రస్తావించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని చెప్పారు. బీసీల జనాభా వివరాలను తెలుసుకునేందుకు కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం రూపొందించామని చెప్పారు.అదే విధంగా ఎస్సీ వర్గీకరణ అంశంలో కూడా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. ఎస్సీల్లోని వివిధ ఉప కులాలకు సమాన న్యాయం జరిగేలా ఈ చట్టం రూపొందించామని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలో కూడా తెలంగాణ రాష్ట్రం మంచి పురోగతి సాధించిందని గవర్నర్ అన్నారు. రాష్ట్రంలో 236 లక్షల టన్నుల వరి ఉత్పత్తి సాధించామని తెలిపారు. దీంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు.రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని గవర్నర్ తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే ఎనిమిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారు 65 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని వివరించారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గవర్నర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటివరకు 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు వివరించారు.పేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు.ఇదిలా ఉండగా అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అసెంబ్లీకి చేరుకున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

ఆ తర్వాత గవర్నర్, ముఖ్యమంత్రి మరియు మంత్రులు కలిసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పునరుద్ధరించిన కౌన్సిల్ భవనం ముందు ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ సభ్యులు బహిష్కరించారు.మొత్తంగా తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలపై గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

మొదటిపేజీ తరువాయి



నిర్వహించాలని భావిస్తోంది.

దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.

# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ?

- “తెలంగాణను ఏటీఎంగా మార్చారు”
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ
- 100 రోజుల్లో హామీలని రెండున్నరేళ్లు గడిచాయని విమర్శ
- రైతుబంధు, రైతుభరోసా అమలు కాకపోవడంపై అసంతృప్తి
- బలహీన వర్గాల బడ్జెట్, దళిత హామీలపై స్పష్టత లేదని వ్యాఖ్య
- మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల హామీలపై ప్రశ్నలు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపించాల్సిన ప్రభుత్వం రాష్ట్రాన్ని ఒక “ఏటీఎం”గా మార్చి ఏఐసీసీకి సమర్పిస్తున్నదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి సరైన శ్రద్ధ లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి పేద మనిషి తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, శాసనసభలో ఈ అంశాలపై గట్టిగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ అసెంబ్లీ మరియు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కావడంతో ముందు గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు కేటీఆర్ నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘనంగా నివాళులు సమర్పించారు. విద్యార్థి అమరవీరుల త్యాగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన అన్నారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ శాసనసభ సమావేశాలకు హాజరవుతున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నాయకులు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అంతేకాదు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలో వాటికి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని తెలిపారు. అయితే ఇప్పుడు రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు.

గతంలో గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ హామీల గురించి ప్రభుత్వం ప్రకటించిందని కేటీఆర్ గుర్తు చేశారు. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంలో కూడా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన ఆ ప్రసంగంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీలకు చట్టబద్ధత ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ఇది మూడో గవర్నర్ ప్రసంగం అయినప్పటికీ ఇప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుపై ఎలాంటి స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు.

రైతుల పరిస్థితి గురించి మాట్లాడుతూ కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాలంలో రైతులకు పంటలు నాటే సమయానికి రైతుబంధు నిధులు అందేవని చెప్పారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు. ఇప్పుడు పంటలు కోతలకు వచ్చినా రైతుబంధు డబ్బులు రైతులకు అందడం లేదని అన్నారు. రైతులకు ఎప్పుడు నిధులు అందిస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని విమర్శించారు.

ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ తెలిపారు. “రాహుల్ బంధు కాదు, రైతుబంధు ఇవ్వాలి” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు సహాయం చేయాల్సిన ప్రభుత్వం వేరే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# డ్రగ్ టెస్టులు తప్పనిసరి చేయాలి

- రాజకీయాలు, సినిమా రంగంలో అమలవ్వాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డిమాండ్
- పైలట్ రోహిత్ రెడ్డి ఘటనతో కలకలం
- డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచనలు
- ప్రజాప్రతినిధులకు తప్పనిసరి టెస్టులపై వినతి
- సినీ తారలు కూడా పరీక్షలు చేయించుకోవాలని పిలుపు
- లేదంటే సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్
- రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న డ్రగ్స్ వ్యవహారం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన ఒక ఘటనతో ఈ విషయం రాజకీయాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పోలీసులకు పట్టుబడినట్లు వెలుగులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో తీవ్ర స్పందనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వ వైఖరి, రాజకీయ నాయకుల పాత్ర వంటి అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి.ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు కూడా స్పందిస్తున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి డ్రగ్స్ వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియాతో జరిగిన అనౌపచారిక సంభాషణలో ఆయన ఈ విషయంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. డ్రగ్స్ సమస్య కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని పలు రంగాల్లో వ్యాపించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో ఆదర్శంగా ఉండాలని అన్నారు. అందుకే ప్రజాప్రతినిధులకు నిర్దిష్ట వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా జీవనంలో ఉన్న ప్రముఖులు డ్రగ్స్ వినియోగం నుంచి పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన అన్నారు.అదే సమయంలో సినిమా రంగానికి కూడా ఈ నిబంధనలు వర్తించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సినీ నటులు, దర్శకులు, నిర్మాతలు, ఇతర ప్రముఖులు కూడా నిర్దిష్ట కాల వ్యవధిలో డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్ట్ చేయించే విధంగా నిబంధనలు తీసుకురావాలని అన్నారు. ఇది అమలులోకి వస్తే డ్రగ్స్ వినియోగాన్ని కొంతవరకు నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా రంగంలో పనిచేసే ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షలు తప్పనిసరి చేస్తే పరిస్థితి మారుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక సినిమా విడుదలకు ముందు అందులో పనిచేసిన ముఖ్య వ్యక్తులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలనే నిబంధన ఉండాలని అన్నారు. ఆ పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే సినిమాలకు విడుదల అనుమతి ఇవ్వాలని సూచించారు. పరీక్షలు చేయించుకోకుండా సినిమాలు విడుదల చేయకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఇదే విధంగా ప్రజాప్రతినిధుల విషయంలో కూడా కఠిన నిబంధనలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోకపోతే ప్రజల్లో అనుమానాలు కలుగుతాయని చెప్పారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు డ్రగ్స్ వినియోగంపై స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రగ్స్ పరీక్షలు చేయించుకోని ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి అనుమతించకూడదని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఘటన రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించినట్లు సమాచారం. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గతంలో కూడా తెలంగాణలో డ్రగ్స్ వ్యవహారం పలు సందర్భాల్లో చర్చకు వచ్చింది. అప్పటి నుంచి ఈ సమస్యపై వివిధ రాజకీయ పార్టీలు ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటూ వచ్చాయి. ముఖ్యంగా గత ప్రభుత్వ కాలంలో డ్రగ్స్ వినియోగం పెరిగిందని కొందరు నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను అప్పటి ప్రభుత్వం ఖండించింది.

ఇప్పుడు ఈ తాజా ఘటనతో మళ్లీ డ్రగ్స్ వ్యవహారం రాజకీయ చర్చగా మారింది. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు కాంగ్రెస్ నాయకులు డ్రగ్స్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలంటే కేవలం చట్టపరమైన చర్యలు మాత్రమే కాకుండా సామాజిక అవగాహన కూడా అవసరమని నిపుణులు చెబుతున్నారు. యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.



## తిరుపతి లో పరశురాం పరివార్ రాజశేఖర్ కు బెస్ట్ సర్వీసు సొసైటీ అవార్డు

**పినపాక నియోజకవర్గం మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం,మండలం సారపాక కు చెందిన పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ బహుజన సాహిత్య అకాడమీ (బియస్ఏ) జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ముత్తవరపు రాజశేఖర్ చేస్తున్నా సేవలకు గాను బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డును అందుకున్నారు.ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి లో మేము చేస్తున్న సేవలకు గాను మొదటి అవార్డు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసు వారి నుండి సేవారత్న అవార్డు పొందాను, ఇప్పుడు రెండో అవార్డు బెస్ట్ సర్వీసు సొసైటీ నేషనల్ అవార్డు ను బహుజన సాహిత్య అకాడమీ వారి చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది అని,ఎనిమిది సంవత్సరాలుగా మేము చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేసిన బహుజన సాహిత్య అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తు లో ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేస్తాము అని,అందరికీ ఆదర్శంగా నిలుస్తాము అని తెలియజేశారు.



## అగ్రి కల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఆత్మ ఆధ్వర్యం లో రైతులకు శిక్షణ కార్యక్రమం

**ఖానాపూరం మార్చి 16 (ప్రజాక్షేత్రం):**



వరంగల్ జిల్లా మండల ఖానాపూరం రైతు వేదికలో "ఆత్మ"(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ మరియు ఇతర అనుబంధ శాఖల పైన ఆత్మ డివిజన్ చేర్మేన్ ఎడ్ల బిక్షం రెడ్డి, మార్కెట్ వైస్ చేర్మేన్ శాఖమూరి హరిబాబు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఉద్యానవన శాఖ అధికారి తరుణ్ మాట్లాడుతూ"ప్రస్తుతం ఆయిల్ పామ్ పంట సాగుకై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మంచి సబ్సిడీలను మరియు ప్రోత్సాహకాలను అందిస్తున్నది. రైతులు దీనిని సద్వినియోగపరుచుకొని అత్యధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటుకోవాలి. అలాగే ప్రస్తుతం కొన్ని వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీలు కలవు. కావాల్సిన రైతులు సంప్రదించాలి"అని అన్నారు. ప్రాంతీయ పరిశోధన స్థానం, ములుగు రోడ్డు వరంగల్, సీనియర్ నేల/మృత్తిక విభాగపు శాస్త్రవేత్త రాములు మాట్లాడుతూ, రైతులు సమగ్రమైన పోషక యాజమాన్యాలు పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే, నేలలు ఆరోగ్యంగా ఉండి, చౌడు భారకుండా ఉండి, మంచి నాణ్యమైన, అధిక దిగుబడులను ఇచ్చును. సాధ్యమైనంతవరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన మేరకే ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలి. పరిమితులను మించి వాడితే నేల ఆరోగ్యము దెబ్బతింటుంది. పంట పెట్టుబడి ఖర్చు రైతుకు ఎక్కువవుతుంది. తద్వారా అనవసరపు చీడపీడలు ఆశించి ఖర్చు ఎక్కువై, నాణ్యత తగ్గిపోవును. పచ్చిరొట్ట ఎరువుల యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం ప్రతి రైతు అలవర్చుకోవాలి. అని అన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ,నర్సంపేట కే.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు & శాస్త్రవేత్తల యొక్క సలహాలు సూచనల మేరకు వ్యవసాయ విధానాలు పాటించి సుస్థిర వ్యవసాయాన్ని అవలంబించుకోవాలని అన్నారు. ఇఫ్కో సంస్థ ఫీల్డ్ మేనేజర్, విశాల్, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, నానో యూరియా మరియు నానో డిఏపి యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత, వాటి ఉపయోగాలు, నేల & పంట ఆరోగ్యం, నానో ఫార్ములా పర్యావరణహితమని, ప్రభుత్వాలపై సబ్సిడీ పెట్టుబడి భారం కూడా భారీగా తగ్గిపోతుందని అన్నారు. "ఆత్మ"వరంగల్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, విజయనిర్మల మాట్లాడుతూ, ఈ "ఆత్మ"ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు శిక్షణ కార్యక్రమాల రూపంలో, అంతర జిల్లా, అంతర రాష్ట్ర ఎక్స్పోజర్ విజిట్ల రూపంలో భవిష్యత్తులో అందించడం జరుగుతుంది. అని తెలిపారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, హరిబాబు మాట్లాడుతూ, "ఆత్మ" ప్రాజెక్టు & ప్రభుత్వము అందించే అన్ని పథకాలను, సబ్సిడీలను రైతులు సద్వినియోగపరుచుకొని ముందంజలో ఉండాలి అని అన్నారు. "ఆత్మ"నూతనంగా నర్సంపేట డివిజన్ కమిటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినటువంటి భిక్షం రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ,"ఆత్మ" పథకానికి సంబంధించి, వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు చెందినటువంటి అధునాతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు శాస్త్రవేత్తలతో, రైతులను సమన్వయ పరుస్తూ, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తూ, నర్సంపేట డివిజన్ రైతులను ముందంజలో ఉంచుతాను అని అన్నారు. రైతులు, అధికారులు "ఆత్మ"నర్సంపేట డివిజన్ కమిటీ నూతన చైర్మన్ ను, శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల వ్యవసాయ శాఖ ఏ వొ శ్రీనివాస్ ఏఈవోలు, మాజీ జడపిటిసి ఎడ్ల జగన్మోహన్ రెడ్డి,వార్డు సభ్యులు వెంకటప్రసాద్,చలిగంటి మల్లికార్జున్,మాజీ సర్పంచ్ సుబ్బారావు రైతులు ఉపేందర్, వెంకటరెడ్డి,శ్రీనివాస్,రాములు, రవి,రత్నాకర్ ప్రభాకర్ తో పలువురు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

- బ్రిక్స్ వేదికగా భారత్ స్పందనపై రాజకీయ దుమారం
- బ్రిక్స్ అధ్యక్ష దేశంగా సమష్టి ప్రకటన చేయలేదన్న కాంగ్రెస్
- అమెరికా, ఇజ్రాయెల్తో సంబంధాల కోసమేమౌనమని ఆరోపణ
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై దౌత్య మార్గాలే పరిష్కారమని వెల్లడి
- ఇరాన్పై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు
- పార్లమెంట్లో పూర్తి స్థాయి చర్చ జరపాలని కాంగ్రెస్ డిమాండ్
- విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటనపై ప్రతిపక్ష అసంతృప్తి

**నేషనల్బ్యూరో, (ప్రజాక్షేత్రం):**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై దేశీయ రాజకీయాల్లో చర్చలు ముదురుతున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్ష దేశంగా వ్యవహరిస్తున్న సమయంలో ఆ వేదిక నుంచి సమష్టి ప్రకటన విడుదల చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. పశ్చిమాసియా పరిస్థితులపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్లో స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న దేశంగా భారత్ అంతర్జాతీయ స్థాయిలో స్పష్టమైన స్పందన ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఇప్పటివరకు పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలపై బ్రిక్స్ తరఫున సమిష్టి ప్రకటన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఇరాన్పై అమెరికా మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన వైమానిక దాడులపై భారత ప్రభుత్వం నేరుగా స్పందించలేదని అన్నారు. ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలోని సైనికేతర లక్ష్యాలపై ఇరాన్ చేపడుతున్న దాడులు, హిందూ మహాసముద్రంలో జరిగిన నౌకాదళ ఘటనలపై కూడా స్పష్టమైన సమిష్టి ప్రకటన చేయడానికి కేంద్రం ముందుకు రాలేదని పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ను సంతృప్తిపర్చాలనే ప్రయత్నం కారణంగా కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కూడా భారత్ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని జైరాం రమేశ్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా వ్యవహరించడం వల్ల బ్రిక్స్ కూటమి అధ్యక్ష దేశంగా భారత్కు ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుందని ఆయన అన్నారు.

పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2025 జూన్ 13 నుంచి ఇరాన్పై జరుగుతున్న సైనిక దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పార్టీ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి చార్టర్కు వ్యతిరేకంగా జరిగే చర్యలు ప్రాంతీయ స్థిరత్వానికి ప్రమాదకరమని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో యుద్ధ చర్యలను వెంటనే ఆపి శాంతి పునరుద్ధరణకు ప్రయత్నాలు చేయాలని సూచించింది. సమస్యలను హింసాత్మక మార్గాల్లో కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య ఘటనపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ విషయంపై గత వారం కూడా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. అమెరికా మరియు ఇజ్రాయెల్తో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం నేరుగా స్పందించడం లేదని ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలపై ఇరాన్ దాడులను భారత్ ఖండించినప్పటికీ, ఇరాన్పై అమెరికాఇజ్రాయెల్ దాడుల విషయంలో మాత్రం మౌనం పాటించిందని కాంగ్రెస్ అభిప్రాయపడింది.

పశ్చిమాసియా పరిస్థితుల ప్రభావం భారతదేశంపై కూడా పడే అవకాశం ఉన్నందున ఈ అంశంపై పార్లమెంట్లో పూర్తి స్థాయి చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. లోక్సభ మరియు రాజ్యసభలో ఈ విషయాన్ని చర్చకు తీసుకురావాలని ప్రతిపక్షం కోరింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు అనుమతించడంలో ఆసక్తి చూపడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంట్లో చర్చ జరిగితే విదేశాంగ విధానంపై ఉన్న లోపాలు బయట పడతాయని ప్రభుత్వం భావిస్తున్నదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల పార్లమెంట్లో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడి పరిణామాలను భారత్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నదని తెలిపారు. పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారకుండా ఉండేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు అవసరమని చెప్పారు. సమస్యలకు శాంతియుత పరిష్కారం కనుగొనాలని భారత్ నమ్ముతుందని ఆయన స్పష్టం చేశారు.

పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత మరియు సంక్షేమం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని జైశంకర్ పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితులను దగ్గరగా గమనిస్తున్నారని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి భంగం కలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అయితే విదేశాంగ మంత్రి చేసిన ఈ ప్రకటనతో కాంగ్రెస్ నేతలు సంతృప్తి వ్యక్తం చేయలేదు. పార్లమెంట్లో పూర్తి స్థాయి చర్చ అవసరమని మళ్లీ డిమాండ్ చేశారు. జైశంకర్ చేసిన ప్రకటన సరిపోదని కాంగ్రెస్ అభిప్రాయపడింది. పశ్చిమాసియా పరిస్థితులపై స్పష్టమైన విధానం వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై పార్లమెంట్లో కూడా ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. లోక్సభలో కూడా కాంగ్రెస్ సభ్యులు నిరసనలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. పశ్చిమాసియా సంక్షోభం వంటి ముఖ్యమైన అంతర్జాతీయ అంశంపై ప్రభుత్వం పార్లమెంట్ను నమ్మకంగా తీసుకోవాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మొత్తంగా చూస్తే పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారతదేశ రాజకీయాల్లో కూడా చర్చకు దారి తీస్తున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం పరిస్థితులను సమీక్షిస్తూ దౌత్యపరమైన పరిష్కారాన్ని కోరుతుండగా, మరోవైపు ప్రతిపక్షం ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ అంశంపై పార్లమెంట్లో మరింత చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- 2025వ సంవత్సరానికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం
- దేశంలోని 24 భాషల్లో ఉత్తమ రచనలకు సాహిత్య అవార్డులు
- కరోనా కాలపు సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన 'అనిమేష'కు గుర్తింపు
- మార్చి 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం
- విజేతలకు తామ్రపత్రం, శాలువా, లక్ష రూపాయల నగదు బహుమతి
- కవిత్వం, నవలలు, కథలు, వ్యాసాలు సహా పలు ప్రక్రియలకు అవార్డులు
- తెలుగు సాహిత్యంలో ప్రత్యేక ముద్ర వేసిన రచయితకు మరో ఘనత

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు-2025ను సోమవారం అధికారికంగా ప్రకటించారు. దేశంలోని వివిధ భారతీయ భాషలలో వెలువడిన ఉత్తమ రచనలను ఎంపిక చేసి ఈ పురస్కారాలను ఖరారు చేసినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించింది. మొత్తం 24 భారతీయ భాషలలోని రచయితలకు ఈ ఏడాది అవార్డులు ప్రకటించబడినట్లు అకాడమీ అధికారులు తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో ఈ అవార్డులను ప్రకటించే సంప్రదాయం ఉన్నప్పటికీ, ఈసారి కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రకటన ఆలస్యమైంది. దీంతో 2025 సంవత్సరానికి సంబంధించిన అవార్డులను ఇప్పుడు అధికారికంగా వెల్లడించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఏడాది ఎంపికైన రచనల్లో విభిన్న సాహిత్య ప్రక్రియలకు చెందిన పుస్తకాలు ఉన్నాయి. మొత్తం అవార్డులలో 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథా సంకలనాలు, 2 వ్యాస సంపుటాలు, ఒక సాహిత్య విమర్శ గ్రంథం, ఒక ఆత్మకథ, రెండు జ్ఞాపకాల పుస్తకాలు (మెమోయిర్స్) చోటు దక్కించుకున్నాయి. దేశంలోని వివిధ భాషల్లో సాహిత్య సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని అకాడమీ పేర్కొంది.

ఈ అవార్డులను అందుకున్న రచయితలకు వచ్చే మార్చి 31న న్యూఢిల్లీ నగరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ప్రతి విజేతకు శాలువా కప్పి సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం అయిన తామ్రపత్రాన్ని అందజేస్తారు. అదనంగా ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని కూడా అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సాహిత్యవేత్తలు, రచయితలు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు అకాడమీ తెలిపింది.

ఈ ఏడాది తెలుగు భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అవార్డు ప్రముఖ కవి నందిని సిధారెడ్డికి దక్కింది. ఆయన రచించిన 'అనిమేష' అనే కవితా సంపుటికి ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. కరోనా మహమ్మారి సమయంలో సమాజంలో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, మానవ సంబంధాలపై పడిన ప్రభావం వంటి అంశాలను కవిత్వ రూపంలో ప్రతిబింబించినందుకు ఈ కవితా సంపుటి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ రచనలో సమకాలీన సమాజం ఎదుర్కొన్న భావోద్వేగాలు, ఆందోళనలు, ఆశలు, నిరాశలను కవి సున్నితంగా చిత్రీకరించినట్లు సాహిత్య విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

నందిని సిధారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందిన కవి. ఆయన రచనలు తెలంగాణ సంస్కృతి, సమాజ జీవితం, గ్రామీణ వాస్తవాలను ప్రతిబింబించేలా ఉంటాయని సాహిత్య వర్గాలు పేర్కొంటాయి. ఈ అవార్డు ద్వారా ఆయన సాహిత్య ప్రయాణానికి మరో గొప్ప గుర్తింపు లభించినట్లు భావిస్తున్నారు. తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలకు ఇది గౌరవ సూచకంగా నిలిచిందని పలువురు సాహిత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

నందిని సిధారెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట ప్రాంతంలో జన్మించారు. ఆయన 1955 జూన్ 12న జన్మించారు. ఆయన తండ్రి నర్రా బాలసిద్ధారెడ్డి స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమకారుడు. తల్లి రత్నమాల. చిన్ననాటి నుంచి సాహిత్యం పట్ల ఆసక్తి కలిగిన సిధారెడ్డి తన విద్యాభ్యాసాన్ని సిద్ధిపేటలో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఉన్నత విద్యను అభ్యసించారు. అక్కడే ఎం.ఏ, ఎం.ఫిల్, పీహెచ్డీ పూర్తి చేశారు.తరువాత ఆయన ప్రభుత్వ కళాశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందించారు. మెదక్ మరియు సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తెలుగు లెక్చరర్గా పనిచేశారు. విద్యార్థులకు తెలుగు సాహిత్యం బోధించడంతో పాటు స్వయంగా కూడా సాహిత్య రచనలు కొనసాగించారు. 2012లో ఆయన ప్రభుత్వ సేవ నుంచి పదవీ విరమణ చేశారు. అయితే పదవీ విరమణ తర్వాత కూడా సాహిత్య రంగంలో ఆయన చురుకుగా కొనసాగుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయనకు మరో ముఖ్య బాధ్యత లభించింది. 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆయనను తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్గా నియమించింది. ఆ బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. తెలంగాణ సాహిత్య సంపదను ప్రోత్సహించడం, కొత్త రచయితలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు.

నందిని సిధారెడ్డి రచనల్లో 'నాగేటి చాల్లల్ల' అనే కవిత ప్రత్యేక ప్రాధాన్యం పొందింది. 1997లో వెలువడిన ఈ కవిత తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. తరువాత అది పాట రూపంలో కూడా ప్రజల్లోకి వెళ్లి మరింత ఆదరణ పొందింది. ఈ రచన ద్వారా ఆయనకు విశేష గుర్తింపు వచ్చింది.

అదనంగా ఆయన భూమిస్వప్నం, ఇగురం, ఆవర్థనం, కుల వృత్తులు, ప్రాణహిత వంటి పలు రచనలు చేశారు. ఆయన కవిత్వం సామాజిక స్పృహతో కూడినదిగా ఉండటంతో పాటు తెలంగాణ భాషా శైలిని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ జీవితంలోని వాస్తవాలు, సామాజిక సమస్యలు, ప్రజల భావోద్వేగాలు ఆయన కవితల్లో ప్రధానంగా కనిపిస్తాయి.

నందిని సిధారెడ్డి సాహిత్య సేవలకు గతంలో కూడా అనేక అవార్డులు లభించాయి. 2010లో 'నాగేటి చాల్లల్ల' పాటకు ఉత్తమ గేయరచయితగా నంది అవార్డు అందుకున్నారు. 2001లో ఆయన రచించిన 'ప్రాణహిత' కవితా సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. 1988లో ఆయనకు దాశరథి పురస్కారం కూడా లభించింది. ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం ఆయన సాహిత్య ప్రయాణంలో మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది.



ఇక ఇతర భారతీయ భాషల్లో కూడా ప్రముఖ రచయితలు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అసోమీ భాషలో దేవబ్రత్ దాస్ రచించిన 'కర్ణి ఖేలార్ సాధు' నవలకు అవార్డు లభించింది. బెంగాలీ భాషలో ప్రసూన్ బందోపాధ్యాయ రాసిన 'శ్రేష్ఠ కబిత' కవితా సంకలనానికి గుర్తింపు దక్కింది. బోడో భాషలో సహైసులి బ్రహ్మ రచించిన నవలకు అవార్డు ప్రకటించారు. డోగ్రీ భాషలో ఖజూర్ సింగ్ ఠాకూర్ కవితా రచనకు ఈ గౌరవం లభించింది.

ఇంగ్లీష్ భాషలో నవతేజ్ సర్నా రాసిన 'క్రిమ్సన్ స్ప్రింగ్' నవలకు అవార్డు లభించింది. గుజరాతీ భాషలో యోగేష్ వైద్య కవిత్వానికి గుర్తింపు దక్కింది. హిందీ భాషలో మమతా కాలియా రాసిన జ్ఞాపకాల గ్రంథం ఎంపికైంది. కన్నడ భాషలో అమరేష్ నుగడోని కథా సంకలనానికి అవార్డు లభించింది.

మలయాళం భాషలో ఎన్. ప్రభాకరన్ రచించిన 'మాయామానుష్యార్' నవల ఎంపిక కాగా, మరాఠీ భాషలో రాజు బావిస్కర్ రాసిన ఆత్మకథకు ఈ గౌరవం దక్కింది. తమిళ భాషలో సా. తమిళ్ సెల్వన్ రాసిన సాహిత్య విమర్శ గ్రంథం ఎంపికైంది. అలాగే ఉర్దూ భాషలో ప్రిత్పాల్ సింగ్ బేతాబ్ కవితా సంకలనానికి అవార్డు ప్రకటించారు.

ఇలా దేశంలోని విభిన్న భాషలలో సాహిత్య సృజనాత్మకతకు కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు ఇవ్వడం ద్వారా భారతీయ సాహిత్య సంపదను ప్రోత్సహించే ప్రయత్నం కొనసాగుతోంది. ప్రతి ఏడాది ఈ అవార్డుల కోసం దేశవ్యాప్తంగా రచయితలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ అవార్డు పొందడం సాహిత్య రంగంలో అత్యంత గౌరవప్రదంగా భావిస్తారు.

## నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్

- **బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు!**



**కొత్తగూడ మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అజాగ్రత్తగా వచ్చిన బైక్, నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని బలంగా ఢీకొట్టింది.కొత్తగూడ మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన వీరన్న (58) అనే వ్యక్తి, మండల కేంద్రంలో తన పనులు ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి కాలినడకన బయలుదేరారు. కొత్తగూడలోని పోచమ్మ గుడి సమీపంలోకి రాగానే, కోనాపూర్ గ్రామానికి చెందిన అక్కెర్ల నితీష్ (26) అనే యువకుడు తన బైక్‌తో వీరన్నను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడని సమాచారం. ఈ ప్రమాదంలో వీరన్నకు, నితీష్ కి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది (పైలట్ ఫక్రుద్దీన్, ఈఎంటీ మహేందర్) ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## అంజనాపురంలో 11 కేవీ లైన్ వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి

- **విద్యుత్ శాఖ ఏడిఈ ని కలిసి వినతిపత్రం అందించిన వార్డు మెంబర్ లకావత్ పవన్ నాయక్**
- **సానుకూలంగా స్పందించిన విద్యుత్ శాఖ**



**బూర్గంపాడు మార్చి 16(ప్రజాక్షేత్రం):**

అంజనాపురం గ్రామంలో నివాస గృహాల మధ్యగా ప్రమాదకరంగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేయాలని రెండో వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ భద్రాచలం ఏడిఈ ని కలిసి వినతి పత్రం అందించినారు.సోమవారం భద్రాచలం ఏడిఈ ఆఫీస్ కి వెళ్లి గ్రామంలో ఇళ్ల మధ్యగా ఉన్న ఈ హై వోల్టేజ్ విద్యుత్ లైన్ కారణంగా ఎప్పటికప్పుడు ప్రమాద భయం నెలకొన్నదని ఆయన తెలిపారు.గాలి,వర్షాలు వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు,మహిళలు మరియు వృద్ధులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి గ్రామానికి బయట లేదా రహదారి మార్గం వెంట ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.ఈ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అత్యవసరంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ తెలిపారు. విద్యుత్ అధికారులు త్వరలోనే గ్రామాన్ని సందర్శించి దానికి సంబంధించిన ఎస్టిమేషన్లు వేపిచ్చి త్వరగానే ప్రత్యాన్మయ విద్యుత్ లైన్ లో ఏర్పాటు చేస్తామని అధికారులు సానుకూలంగా స్పందించినారు. స్పందించిన విద్యుత్ అధికారులకు వార్డు మెంబర్ కృతజ్ఞతలు తెలిపారు.

## భూములు కోల్పోతున్న రైతన్నలకు నష్టపరిహారం ఇవ్వాలి

**వలిగొండ మార్చి 16(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో గౌరెల్లి నుండి భద్రాచలం రోడ్డుకు భూమి కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని గౌరవెల్లి నుండి భద్రాచలం రోడ్డు భూ బాధితు లుమల్లారవీందర్ ఆధ్వర్యంలోధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రొద్దుటూరు, ఎదుల్లగూడెం, మాందాపురం, నాతల్లగూడెం, దాసిరెడ్డిగూడెం మల్లేపల్లి,లోతుకుంట,సంగెం, వర్కట్పల్లి, రైతులు పాల్గొన్నారు .ఈ ధర్నా కార్యక్రమానికి టిఆర్ఎస్ నాయకులు పూర్తి మద్దతు తెలిపారు మాజీ ఎంపీటీసీ పల్సంరమేష్,మాజీ జడ్పిటిసి మెగ్గుల శ్రీనివాస్,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, టేకుల సోమవారం సర్పంచ్ పడమటి మమత, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగిస్వామి మాట్లాడుతూ గౌరెల్లి భద్రాచలం రోడ్డు భూ బాధితులకు బహిరంగ మార్కెట్ రేట్ ప్రకారం మూడింతల నష్టపరిహారాన్ని ఇవ్వాలని అన్నారు.రైతులు మల్గా సత్యనారాయణ,మల్గా వెంకటేశం,భీమిడి మల్లారెడ్డి,నారీ రమేష్,కోనపురి శ్రీశైలం,దేవరపల్లి భూపాల్ రెడ్డి,రాపోలు గోపి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యూడిషియల్ కమిటీని మాత్రమే ఒప్పుకుంటాం

- **సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**

**వలిగొండ మార్చి 16(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను గుర్తించడానికి జ్యుడీషియల్ కమిటీని మాత్రమే ఉద్యమకారులు ఒప్పుకుంటారని. కానీ రాజకీయ లేదా అప్పటి టీజేఏసీ నాయకులతో కమిటీ వేస్తే ఉద్యమకారులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని అలాంటివి కాకుండా జ్యుడీషియల్ చట్టబద్ధత కలిగిన కమిటీని మాత్రమే ఉద్యమకారులను గుర్తించడానికి వేయాలని మలిదశ ఉద్యమకారుడు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**పినపాక మార్చి 16(ప్రజాక్షేత్రం):**

ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్ లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు :**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్న సాంబ పూర్ణచంద్రరావు (తండ్రి: వెంకటేశ్వర్లు) తమకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని గాజులరాజా బస్తీ, విశ్వనాథ కాలనీ, హౌస్ నం.169/A వద్ద 0.22 కుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి గృహ నిర్మాణం చేపడుతున్నారని, కావున తగిన చర్యలు తీసుకొని తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలంటూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.

లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీ సుమారు 35 సంవత్సరాల క్రితం ఏర్పడినప్పటి నుండి సీసీ రోడ్డు నిర్మాణం కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం జరగలేదని తెలిపారు. 2019లో రూ.20 లక్షలు మంజూరైనట్లు చెప్పినప్పటికీ డ్రైనేజీ మరియు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని పేర్కొంటూ వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.

టేకులపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన అశోక్ తమ గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రితం మిషన్ భగీరథ ట్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు సక్రమంగా నీటి సరఫరా జరగలేదని తెలిపారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లు కూడా ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటూ వేసవి కాలంలో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించడంతో పాటు బోర్లను మరమ్మతు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మిషన్ భగీరథ అధికారులకు ఎండార్స్ చేశారు.





మణుగూరు మండలం విట్టల్‌రావు నగర్‌కు చెందిన రావుల రాములు (తండ్రి: లేటు నారాయణ) తమకు తిర్లాపురం గ్రామం సర్వే నం.16/23/Aలో ఐదు ఎకరాల భూమి ఉందని తెలిపారు. తమ తండ్రి మరణానంతరం కుటుంబ సభ్యులు ఆ భూమిని తమ పేర్లతో సర్వే చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ వివాదంలో ఉన్న భూమిపై సర్వే ప్రక్రియతో పాటు భూమి పరిహారం చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూసేకరణ అధికారులకు ఎండార్స్ చేశారు.

ములకలపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఉకంటి రవికుమార్ (తండ్రి: వెంకట్రావు) గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పాలకవర్గాలు లేని సమయంలో నిర్వహించిన ఖర్చులు మరియు అప్పుల వివరాలను గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రజలకు తెలియజేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి ఎండార్స్ చేశారు .ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కీసరలో పట్టపగలు దొంగతనం...

- **ఇంటి తాళం విరగొట్టి 3 తులాల బంగారం అపహరణ**

**కీసర,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలు దొంగతనం ఘటన కలకలం రేపింది. సుభాష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరెడ్డి ఇంటికి తాళం వేసి ఆయన భార్య శిరీష బయటకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం విరగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, ఒక ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం లభించాలి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**

**వనపర్తి,మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తో కలిసి ఆయన హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 34 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా వారంలోగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## కీసరలో వ్యక్తి మృతి

**కీసర,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

కీసరలో అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అరుంధతి స్కూల్ సమీపంలో నివసిస్తున్న శ్రీను (60) ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పక్క గదిలో ఉంటున్న మహేష్ గమనించి ఆటోలో కీసరలోని నితిన్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువుల వివరాలు తెలియరాలేదని, అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నామని పిర్యాదుదారు బనోతు కృష్ణ పేర్కొన్నారు.ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మండల అధికారులను కలిసిన రాష్ట్ర ఆర్టిఐ అధ్యక్షులు జన్నావుల సురేంద్ర



**బంగారుపాళ్యం మార్చి 16(ప్రజాక్షేత్రం):**

బంగారుపాలెం మండలం లోని సోమవారంరోజు మండల పరిధిలోని అధికారులను కలిసిన ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షులు జన్నావుల సురేంద్ర ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్టీఐ సభ్యులు జిల్లా ఆర్టిఐ సభ్యులు నియోజవర్గ ఆర్టీఐ సభ్యులుమండల ఆర్టిఐ సభ్యులు అందరూ కలిసి మండల అధికారులైన ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శిరీష్, మండల హౌసింగ్ ఏఈ జ్ఞాన శేఖర్, మండల ఎంఈఓ రమేష్, మండల పిఆర్ఏఈ కృష్ణయ్య, మండల సిడిపిఓ వినత శ్రీ, మండల ఏపిఎం రవి,సెక్రెటరీ శేషు, వీఆర్వో వెంకటరత్నం, వీరందరిని ఈరోజు అధికారంగా ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థకమిటీ సభ్యులు కలవడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, వెంకటరమణ,వెంకటేష్ రెడ్డి, రెడ్డప్ప,మొగిలేష్,సుందరం,జై చంద్ర, శ్రీనివాసులు,పవన్,చిట్టి, రాహుల్,రఘు,మోహన్,ప్రతాప్, భరత్,వేణు నాయుడు, తదితరులు ఆర్టీఐ సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు,



## వృద్ధాప్యంలో వివాదాలు నివారించాలంటే
# కండిషన్ గిఫ్ట్ డీడ్ మంచిది



- **ప్రజావాణిలో 7 ఫిర్యాదులు**

**వనపర్తి ఎస్పీ సునిత రెడ్డి.**

వనపర్తి,మార్చి 16 (ప్రజాక్షేత్రం): వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే పిల్లలకు ఆస్తులు ఇచ్చే టప్పుడు సాధారణ గిఫ్ట్ డీడ్ కంటే కండిషన్ గిఫ్ట్ డీడ్ చేయడం మంచిదని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ సునిత రెడ్డికి వివరించారు. అందిన ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఆమె, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా వెంటనే ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.

ఇటీవల తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పిల్లలు ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయని ఎస్పీ తెలిపారు. అందువల్ల తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లలకు ఇవ్వాలనుకుంటే కండిషన్ గిఫ్ట్ డీడ్ చేయడం ద్వారా తల్లిదండ్రులను చూసుకోవాలి వంటి షరతులను నమోదు చేయవచ్చని చెప్పారు. ఈ డీడ్‌ను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చట్టబద్ధంగా నమోదు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఉండొచ్చని సూచించారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 7 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెండు భూతగాదాల సంబంధిత ఫిర్యాదులు కాగా,ఐదు ఇతర సమస్యలకు సంబంధించినవని అధికారులు తెలిపారు.



# దద్దరిల్లిన బహుజన రాజకీయ యుద్ధభేరి సభ

- **తెలంగాణలో 90% ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీలు అధికారం కోసం ఏకం కావాలి**
- **బిఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ అత్తర్ సింగ్ రావ్ పిలుపు**
- **పాలన మారిన పరిస్థితులు మారలే**
- **మనువాద పార్టీల పాలనలో దాడులు, దౌర్జన్యాలు,హత్యలు, అత్యాచారాలు**
- **బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్**
- **రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్**

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 16(ప్రజాక్షేత్రం):**

బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షిరాం 92వ జయంతి కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల కార్యకర్తలు హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ జాతీయ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ సమావేశానికి జోనల్ ఇంచార్జ్ అంతటి నాగన్న వేదిక ఆహ్వానంతో ప్రారంభమైన ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు బిఎస్పి పార్టీ జాతీయ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు మాట్లాడుతూ తెలంగాణలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలు అధికారం కోసం ఏకం కావాలని పిలుపునిచ్చారు, నూటికి 90 శాతం గా ఉన్న మనం తెలంగాణ రాష్ట్రంలో గద్దెనేక్కవలసిన అవసరం ఉందన్నారు, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్న అగ్రకుల మనువాద పాలకులు ఒకరి తర్వాత ఒకరు అధికారంలోకి వచ్చి బహుజన్లను మోసం చేస్తూ కుట్రపూరితంగా అణచివేస్తున్నారన్నారు, నీళ్లు నిధులు నియామకాల నినాదాలతో ఏర్పడ్డ తెలంగాణలో బహుజనులకు నీళ్లు నిధులు నియామకాలు రాలేదన్నారు, పార్టీలు మారిన బహుజనుల పరిస్థితులు మారలేదన్నారు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలపై దాడులు దౌర్జన్యాలు హత్యలు అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్న అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ , ద్వంద నీతికి, మోసపూరిత విధానాలకు, నిదర్శనం అన్నారు. దాడులను అంచవేతలను తిప్పి కొట్టాలంటే తెలంగాణలో బీఎస్పీ బలపడవలసిన అవసరం నూటికి నూరు శాతం ఉందని ఉద్ఘాటించారు, మాన్యవర్ కాన్సిరాం గారు యూపీ కే బాద్ ఏపీ అన్న మాటను మరవకూడదని, తెలంగాణ ఏర్పాటు కోసం ఏర్పాటైన ఐక్య కార్యాచరణ, తెలంగాణలో బహుజనుల అధికారం కోసం బహుజనులు ఐక్య కార్యాచరణతో బీఎస్పీ పార్టీతో జతకట్టి, బహుజన్లు బలపడాలన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో బహుజన కళాబృందంచే ఆటపాట నిర్వహించగా. పాటమ రాంబాబు, గజ్జల అశోక్, కుంట శ్రీనివాస్, గుడిపల్లి శ్రీకాంతుల బృందం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచారు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కేతావత్ బహుగుణ నాయక్ తో పాటు తోపాటు మహేశ్వరం అసెంబ్లీ నాయకులు ఈ కార్యక్రమ ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించారు , ఈ కార్యక్రమంలో జోనల్ చీఫ్ కోఆర్డినేటర్లు బానోతు రవీందర్ నాయక్, సైఫూలఖాన్ , రాష్ట్ర కార్యదర్శి శీలం అనిత రెడ్డి, జోనల్ ఇన్చార్జులు, అంతటి నాగన్న, బీసమోళ్ళ యోసేఫ్, బండి పృథ్వీరాజ్,






ఘనపురం కృష్ణ, జి.గంగాధర్, జుట్ల నరేందర్, మిద్దే శివప్రసాద్, జిల్లా ఇన్చార్జులు గౌడ సుదర్శన్ , పలాటి రాములు, బండారి రవి ముదిరాజ్, అమీర్ సయ్యద్ , జక్క యాదగిరి, మిద్దె మహేష్, మాసన్న, జిల్లా అధ్యక్షులు బోనాసి రామ్ చందర్, ధార రామచందర్, డి వై గిరి మహారాజు గారు, బండారి శ్రీనివాస్, బొదిగెల శ్రీనివాస్, గూడెం ఎల్లస్వామి, మణికుమార్, జిల్లా కమిటీ నాయకులు, జిల్లా మహిళా ఇన్చార్జులు,కన్వీనర్లు, ఉమ్మడి జిల్లాల నుండి అసెంబ్లీ ఇన్చార్జులు అధ్యక్షులు తదితర కార్యకర్తలందరూ పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలి

- **గాజుల ఆంజనేయులు తెలంగాణకల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు**

**వలిగొండ మార్చి 16(ప్రజాక్షేత్రం):**




రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకలకు పెంచి 40 కోట్ల బడ్జెట్ అసెంబ్లీ సమావేశంలో విడుదల చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న మండల కమిటీ సభ్యులను పూలమాలలు వేసి వారి దీక్షకు మద్దతుగా ఒకరోజు సంఘీభావం లో పాల్గొంటూ ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు గాజుల ఆంజనేయులు జిల్లా ఉపాధ్యక్షుడు భావనల పెండ్లి బాలరాజు మాట్లాడుతూ ప్రతిరోజు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి 400 మంది ఒపి ద్వారా వైద్యం కోసం వచ్చేవారు 30 పడకల ఆసుపత్రి ఉండడం వలన వారికి వైద్యము అందుట లేదు ప్రతి విషయాన్నికి నల్లగొండకు హైదరాబాదుకు రాస్తున్నారు. కావున ప్రభుత్వం ఆలోచించి బడ్జెట్లో 40 కోట్లు కేటాయించి ఆస్పత్రిని 100 పడకలుగా పెంచాలని డాక్టర్లను నియమించాలని నిరాహార దీక్ష చేస్తున్న సిపిఎం మండల కమిటీ సభ్యులకు మద్దతు తెలుపుతూ కల్లు గీత కార్మిక సంఘం పూర్తిగా దీక్షలు విజయవంతం కావాలని కోరుకుంటున్నాము.ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు కునూరు మల్లేశం,కోశాధికారి మునుకుంట్ల లెనిన్,పల్లె సత్యం,తోర్పునూరి శ్రీనివాస్,గుండాల ప్రసాద్,కునూరు గణేష్,అంతటి సత్తయ్య,బావండ్లపల్లి సత్యం,అంతటి నరసింహ, తాళ్లపల్లి జితేందర్,గుడిసె మల్లేశం,గంగాదేవి ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఫిల్టర్ చేయని త్రాగునీరు సరఫరాచేస్తున్నకాంట్రాక్టర్, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ.పై చర్యలు తీసుకోవాలి..!

- **దళిత కాలనీ అని వివక్షతతో ఫిల్టర్ చేయనిఅపరిశుభ్రత, కలుషిత నీరు సరఫరా**
- **కోసిగి మార్కెట్ యార్డ్ వైయస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న**
- **ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతి పత్రం అందజేత**

**పెద్ద కడుబూర్ మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రమైన పెద్దకడబూరు మండలంలోని ఎస్సీ కాలనీకి,ఫిల్టర్ చేయని కలుషిత అపరిశుభ్రత త్రాగునీటిని సరఫరా చేస్తున్న సమ్మర్ స్టోరీస్ ట్యాంక్ కాంట్రాక్టర్ పై ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ చర్యలు తీసుకోవాలని మంత్రాయం నియోజకవర్గం కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న కార్తికేయ డిమాండ్ చేశాడు. నేడు మండల కేంద్రమైన ఎం.పీ.డీ.ఓ. ఆఫీస్ నందు జరిగిన పి. జి. ఆర్. ఎస్. ప్రోగ్రామ్ నందు మండల అభివృద్ధి అధికారి అయిన ప్రభావతి దేవి కి ఫిర్యాదు చేశారు.
ఈ సందర్భంగా బొగ్గుల తిక్కన్న కార్తికే మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి,ఎస్సీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి ప్రతి ఐదు రోజులకు,ఒకసారి త్రాగునీరు సరఫరా చేస్తున్నారని అయితే ఆ నీటిని ఫిల్టర్ చేయకుండా నేరుగా వదులుతున్నారని ఈ కారణంగా సరఫరా చేస్తున్న కలుషిత అపరిశుభ్రత నీరు త్రాగుటకు అనర్హంగా ఉండి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు.ఈ నీటిని తాగిన గ్రామ ఎస్సీ ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు గడచిన గురువారం శుక్రవారం సరఫరా చేసిన నీరు త్రాగి చాలామంది కాలనీలో విషజ్వరాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ కు,మరియు రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ డిపార్ట్మెంట్ ఇంజనీర్ వారికి ఈ విషయం తెలిసిన సరైన చర్యలు తీసుకోవడం లేదని,ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా దళిత కాలనీ కావడంతో వివక్షతతో ఫిల్టర్ చేయని నీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు అనుమానిస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి సురక్షితమైన త్రాగునీరు పొందే హక్కు ఉంది. అయితే దళిత కాలనీకి ఇలాంటి నిర్లక్ష్యం చూపడం సామాజిక వివక్షకు నిదర్శనం అన్నారు. అందువల్ల ఈ చర్యలు షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబస్ ప్రివెన్షన్ యాక్ట్ 1989 లోనే నిబంధనలకు వ్యతిరేకంగా ఉండే అవకాశం ఉందన్నారు. కాబట్టి మహోదయులు ఎం.పి. డి.ఓ. ప్రభావతి దేవి పెద్ద కడుబూరు గ్రామంలోనే ఎస్సీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీటి సరఫరా పై తక్షణ విచారణ చేయాలని, దళిత ప్రజలకు ఫిల్టర్ చేసిన శుద్ధమైన త్రాగునీరు మాత్రమే సరఫరా చేయాలని తక్షణ ఆదేశాలు ఇవ్వాలని,నిర్లక్ష్యం చేసిన సంబంధిత కాంట్రాక్టర్ మరియు ఆర్డబ్ల్యూస్. ఏ. ఈ.ఇంజనీర్ పై కఠినమైన పరిపాలన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నీటి నాణ్యత పై వాటర్ క్వాలిటీ టెస్ట్ నిర్వహించి నివేదిక ప్రజలకు వెల్లడించాలని అవసరమైన ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాల తర్వాత కూడా దళితులకు కనీస శుద్ధమైన త్రాగునీరు అందకపోవడం చాలా బాధాకరమని అందువల్ల ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి మా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందేలాగున చర్యలు తీసుకుని న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఏ జంభన్న , మండల తెలుగు యువత నాయకులు ఏం.రామన్న పాల్గొన్నారు.



## గ్రామ అధ్యక్షుడే గ్రామానికి పెద్దదిక్కు

- **సంస్థాగత బలోపేతానికి సమర్థవంతమైన సేవకులను ప్రతిపాదించండి**
- **ఐక్యతతో పనిచేస్తేనే కాంగ్రెస్‌కు సంపూర్ణ విజయం.**
- **జిల్లా కాంగ్రెస్ చీఫ్ కే శివసేన రెడ్డి**

**వనపర్తి, మార్చి 16 (ప్రజాక్షేత్రం):**





కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలంటే గ్రామాలు, మండలాల్లో సమర్థవంతమైన సేవకులను అధ్యక్షులుగా ప్రతిపాదించాలని వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఐక్యతతో పనిచేస్తేనే కాంగ్రెస్ పార్టీకి నిజమైన విజయం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి శివసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయడం వల్లనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అలాంటి కార్యకర్తలకు న్యాయం చేసే విధంగా ఏఐసీసీ, టిపిసిసి మార్గదర్శకాల మేరకు పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గ్రామానికి ప్రథమ స్థానంలో ఉంటాడని, భవిష్యత్తులో పార్టీకి సంబంధించిన కీలక నిర్ణయాల్లో వారి అభిప్రాయానికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల, బూత్ స్థాయిల వరకు సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా పార్టీ మరింత పటిష్టం అవుతుందని పేర్కొన్నారు. అమరచింత మండల కేంద్రంలో కూడా మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాటు చేసిన సమావేశంలో శివసేన రెడ్డి పాల్గొన్నారు. భవిష్యత్తులో పార్టీ పదవుల నియామకాల్లో గ్రామ కమిటీ అధ్యక్షుల అభిప్రాయమే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా,మున్సిపల్ చైర్మన్లు నాగమణి,సువర్ణ రవి, వైస్ చైర్మన్లు శ్రీనివాసులు,రాధ, మాజీ కౌన్సిలర్ బ్రహ్మాచారి, పాండు సాగర్,మండల అధ్యక్షుడు పరమేష్,తులసిరాజ్, గంగాధర్,వెంకట్, కృష్ణమూర్తి, తిరుపతి,శ్రీను,నాగరాజుగౌడ్, జింక రవి,రమేష్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి

**రాజేంద్రనగర్, మార్చి 16(ప్రజాక్షేత్రం):**

గండిపేట జలాశయం దిగువనున్న మూసి నది పరివాహక ప్రాంతంలో విషాదం చోటు చేసుకుంది. చేపల వేట కోసం వెళ్లి శుక్రవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురు యువకులు మృతి చెందారు. నార్సింగి పోలీస్ లు, రెస్క్యూ టీమ్స్ చేపట్టిన గాలింపు చర్యల్లో సోమవారం నాడు వారి మృతి దేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనలో చేపల ను పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కార్తీక్ (25), గోవర్ధన్ (23) వెంకటేష్ ( 25) మృతి చెందారు, మృతులంతా హైదరాబాదులోని ఇబ్రహీంబాద్ ప్రాంతానికి చెందిన వారిగా నార్సింగి పోలీసులు గుర్తించారు. మృతదేహాలను వెలికి తీసి ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## నాగారం డివిజన్‌లో నిర్మాణ నిబంధనలు గాలికి

- **జీ+2 అనుమతితో జీ+2+ఫెంట్ హౌజ్ నిర్మాణాలు ...**
- **నాగారం డివిజన్‌లో చెలరేగుతున్న అక్రమ కట్టడాలు**

**నాగారం,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని ఘట్‌కేసర్ సర్కిల్‌లోని నాగారం డివిజన్‌లో అనుమతులకు మించి నిర్మాణాలు విస్తరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీ+2 వరకు మాత్రమే అనుమతి తీసుకున్న కొందరు నిర్మాణదారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రౌండ్ ప్లస్ రెండ్ ఫ్లోర్లు ప్లస్ ఫెంట్ హౌజ్‌లతో భవనాలను నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో పార్కింగ్ స్థలం, సెట్బ్యాక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా తలెత్తే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అలాగే అక్రమ నిర్మాణాల వల్ల కాలనీలలో రోడ్లు ఇరుకుగా మారి అత్యవసర సమయంలో అంబులెన్స్, ఫైర్ సిబ్బంది వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బిల్డర్లు అధికారులతో కుమ్మక్కై నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని కూడా స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి నాగారం డివిజన్‌లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టకపోతే సమస్య మరింత తీవ్రమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.




## ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

**మేడ్చల్,మల్కాజిగిరి మార్చి16(ప్రజాక్షేత్రం):**

ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద 48 గంటల నిరసన దీక్ష ప్రారంభమైంది. దీక్షను సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ ప్రారంభించారు. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ తగిన వేతనాలు,సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.జనవరి,ఫిబ్రవరి నెలల పారితోషికాలు వెంటనే చెల్లించడంతో పాటు పి.ఆర్.సి ఎరియర్స్, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీ పెండింగ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం,ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి రేవతి ,ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాన సేవా చక్రవర్తి అవార్డు అందుకున్న నందనంపాటి రాము

**ఈసీఐఎల్,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పేదలు, భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవాభావాన్ని చాటుతున్న ఈసీఐఎల్‌కు చెందిన సోలిస్ ఐ కేర్ సీఎండీ, తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ నందనంపాటి రామును ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సోమవారం ఈసీఐఎల్‌లోని సోలిస్ ఐ కేర్ ఆసుపత్రిలో "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు అందుకున్న సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి పాల్గొని నందనంపాటి రామును అభినందించారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. పాండిచ్చేరిలోని తిరునల్లార్ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన శని పేర్చి పవిత్ర ఉత్సవాల సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్, సోలిస్ ఐ కేర్ ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది భక్తులకు



అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదవసారి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నందనంపాటి రాము పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ చేతుల మీదుగా నందనంపాటి రాముకు "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు ప్రదానం చేశారు. పేదలు,అవసరమైన వారికి అన్నప్రసాదం అందించడం ద్వారా ఆయన మానవతా విలువలను చాటుతున్నారని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సోలిస్ ఐ కేర్ సిబ్బంది విజయేందర్ రెడ్డి,మహేష్, విజయలక్ష్మి, భాస్కర్,గజేందర్, మోహన్,నీరజ తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు: రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు.

**వికారాబాద్ జిల్లా బ్యూరో 16(ప్రజాక్షేత్రం):**



రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ప్రాంతంలో జరిగిన ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఈ కేసులో జరిగిన పరిణామాలు, డ్రగ్స్ వినియోగం, రక్త పరీక్షల ఫలితాలు, పార్టీలో పాల్గొన్నవారి వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసుకు సంబంధించిన పోలీసుల రిమాండ్ రిపోర్టులో పలు కీలక అంశాలు బయటపడ్డాయి. ముఖ్యంగా స్విమ్మింగ్ పూల్ దగ్గర డ్రగ్స్‌తో పాటు మద్యం పార్టీ జరిగినట్లు పోలీసులు తమ రిపోర్టులో పేర్కొన్నారు. పార్టీలో పాల్గొన్నవారు లిక్కర్‌తో పాటు డ్రగ్స్ తీసుకున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని చెప్పారు.

**డ్రగ్స్ పార్టీకి ముందుగానే ప్లాన్..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ పార్టీ ముందుగానే ప్లాన్ చేసినట్లు తెలిపారు. పార్టీలో ఉన్నవాళ్లు లిక్కర్‌తో పాటు డ్రగ్స్ తీసుకున్నట్లు ఒప్పుకున్నారని అన్నారు. మరోసారి ఎర్రగడ్డ ఆస్పత్రిలో అందరికీ రక్తనమూనాలతో పరీక్షలు నిర్వహించామని చెప్పారు. రెండోసారి పరీక్షలు చేసిన సమయంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని అన్నారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడిందని చెప్పారు. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డిలు కొకైన్ తీసుకున్నట్లుగా రిపోర్టులో వచ్చిందని వెల్లడించారు. ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలిందని పోలీసులు పేర్కొన్నారు.

నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని పోలీసులు వివరించారు. ఈ పార్టీలో మద్యం, కొకైన్ కలుపుకొని తాగారని అన్నారు. పైలట్ రోహిత్ రెడ్డినే వీరందరికి వీకెండ్ డ్రగ్స్ పార్టీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇంకా రిమాండ్ రిపోర్టులో పోలీసులు పలు అంశాలను ప్రస్తావించారు.

**మేము వారించినా కాల్పులు జరిపారు: పోలీసులు**

ఫామ్‌హౌస్‌లోకి వెళ్లగానే మొదటగా తుపాకీ శబ్ధాలు వినపడ్డాయని పోలీసులు తెలిపారు. 'తుపాకీ కాల్పుల శబ్ధాలు విని వెంటనే మేమంతా అప్రమత్తమయ్యాం. కాల్పులు జరపొద్దని, ఎలాంటి చర్యలు తీసుకోమని మేము గట్టిగా చెప్పాం. మేము చెప్పిన్నప్పటికీ కూడా మరో రెండు సార్లు తుపాకీ కాల్పుల శబ్ధాలు వినిపించాయి. మరోవైపు మీరు కాల్పులు జరపండి.. నేను మొత్తం చూసుకుంటాను.. ఏం జరిగినా నాదే బాధ్యత అంటూ ఫాంహౌస్ నుంచి మాకు గట్టిగా వినపడింది. మేమంతా గట్టిగా వారించే సరికి ఒక్కసారిగా తుపాకీ కాల్పుల శబ్ధాలు నిలిచిపోయాయి. మేమంతా ఒక్కసారిగా స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకున్నాం. ఫామ్‌హౌస్‌లో రైడ్స్ చేసేందుకు అప్పటికే మేము వారెంట్ తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లోకి ప్రవేశించగానే వెంటనే సెర్చ్ వారెంట్లను రోహిత్ రెడ్డికి ఇచ్చాం. బాత్ రూం దగ్గర ఉన్న నమిత్ శర్మ చేతిలో తుపాకీని మేము స్వాధీనం చేసుకున్నాం. బుల్లెట్ షెల్స్ పట్టుకొని మరొకరు ఉన్నారని, అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లో ఓ మహిళతో పాటు పదిమందిని అదుపులోకి తీసుకున్నాం. జర్మనీకి చెందిన రివాల్వర్ 32ని స్వాధీనం చేసుకున్నాం. 11 మందిని వేర్వేరుగా విచారించాం. ఎవరు కూడా డ్రగ్స్ తీసుకోలేదని చెప్పి బుకాయించే ప్రయత్నం చేశారు. అందరిని పదేపదే విచారించడంతో సిల్వర్ శరత్ కుమార్ డ్రగ్స్ తీసుకున్నట్లుగా ఒప్పుకున్నారు. అతన్ని పరిశీలించినప్పుడు రెండు గ్రాముల కొకైన్ బయటపడింది' అని పోలీసులు వెల్లడించారు.

**సిమ్లా నుంచి డ్రగ్స్..**

కొకైన్ ఎవరు తెచ్చారనే విషయాన్ని వారిని ముందుగా అడిగితే చెప్పలేదని పోలీసులు తెలిపారు. పైలట్ రోహిత్ రెడ్డి డ్రైవర్‌ను విచారించినప్పుడు కొకైన్ ఎవరు తెచ్చారనే విషయం బయటపడిందని అన్నారు. 'ఈ డ్రగ్స్ కోసం కొంత డబ్బును కొందరికి ఇచ్చినట్లు డ్రైవర్ ఒప్పుకున్నారు. కొకైన్ తానే తెచ్చానని కౌశిక్ ఒప్పుకున్నారు. సిమ్లా బిజినెస్ ట్రిప్‌నకు వెళ్లినప్పుడు తాను కొకైన్ తీసుకువచ్చానని చెప్పారు. సిమ్లాలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ డ్రగ్స్ కొన్నట్లుగా తెలిపారు. డ్రగ్స్ పార్టీ కోసమే కొకైన్‌ను తీసుకువచ్చినట్లు కౌశిక్ చెప్పారు. డ్రగ్స్ ఒక్కొక్క గ్రామ్‌కి రూ.15000లు చెల్లించి కొనుగోలు చేసినట్లు కౌశిక్ చెప్పారు. 11 మందికి డ్రగ్ లైవ్ కిట్స్ ద్వారా టెస్టులు చేశాం. అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి, రితేశ్‌రెడ్డి, నమిత్ శర్మ, రోహిత్‌రెడ్డిలకు డ్రగ్స్ పాజిటివ్‌గా వచ్చింది. కాల్పులు జరిపిన నమిత్ శర్మని అరెస్ట్ చేశాం. ఈ కాల్పులు జరిపిన తుపాకీని పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డికి చెందినదిగా గుర్తించాం. లైసెన్సు రివాల్వర్ నితీశ్‌రెడ్డి వద్ద ఉండాల్సిందని.. కానీ నమిత్ శర్మ వద్దకు వచ్చింది. ఉద్దేశపూర్వకంగానే కాల్పులు జరిగినట్లు నమిత్ శర్మ చెప్పారు. ఫామ్‌హౌస్‌లోకి వస్తున్న పోలీసులను భయభ్రాంతులకు గురి చేయడానికే కాల్పులు జరిపినట్లు నమిత్ శర్మ తెలిపారు. కాల్పులు జరిపి ఫామ్‌హౌస్ నుంచి తప్పించుకొని పారిపోవాలని వారు ప్లాన్ చేశారు. తుపాకీతో కాల్పులు చేసి పోలీసులను తీవ్రంగా గాయపరచాలని అనుకున్నారు' అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## మార్కెట్ ప్రాంతాల్లో చెత్తపై నిఘా...
## క్షేత్రస్థాయిలో కమిషనర్ తనిఖీలు




- **ఫాక్స్ సాగర్ చెరువు పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

**కుత్బుల్లాపూర్,మార్చి 16 (ప్రజాక్షేత్రం):కొంపల్లి**

నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ లలిత్‌కుమార్, ఐఏఎస్ కొంపల్లి సర్కిల్-56 పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పర్యటనలో ఆయన శానిటేషన్ కార్మికులతో కలిసి ప్రాంతాల వారీగా పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు.

సెంట్రల్ పార్క్ మార్కెట్ రోడ్ ప్రాంతాన్ని సందర్శించిన జోనల్ కమిషనర్ అక్కడి దుకాణదారులతో మాట్లాడి పరిశుభ్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి దుకాణం ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి చెత్తను అందులోనే వేయాలని తెలిపారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల పరిసరాలు కలుషితమవుతాయని పేర్కొన్నారు. ఈ నిబంధనలను పాటించని దుకాణాలపై జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు.

అనంతరం జయభేరి పార్క్ మరియు ఉమా మహేశ్వర కాలనీ సమీపంలోని ఫాక్స్ సాగర్ చెరువు కట్ట ప్రాంతాలను పరిశీలించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఇందుకోసం మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు.ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి,సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ ఎం.తిరుపతి,ఏఈఈ కుమారి కృపా మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## పేదరికం నుంచి పాఠశాల వరకు...
## "కృషి"తో సాకారం అయిన విద్యా ప్రయాణం

**కుత్బుల్లాపూర్,మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

సూరారంసంకల్పం ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని మరోసారి నిరూపించింది కృషి హై స్కూల్. సురారం కాలనీ రామ్‌లీల మైదానంలో నిర్వహించిన పాఠశాల 17వ వార్షికోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, పేదరికం నుంచి ప్రారంభమైన ఒక విద్యా ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుధీర్ సంద్ర, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కృషి హై స్కూల్ మరియు కృషి గ్రీన్ హిల్స్ బ్రాంచ్ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చిన్నారులు భగవంతుని వేషధారణలో చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా సుధీర్ సంద్ర మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రోత్సాహం ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. క్రమశిక్షణతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ తన జీవితం సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రారంభమైందని, తన తల్లి వనజ కుమారి చేసిన కృషి కారణంగానే ఈ పాఠశాల ఏర్పాటైందని తెలిపారు. మొదట కేవలం 200 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల ప్రస్తుతం 1300 మంది విద్యార్థులతో అభివృద్ధి చెందడం ఆనందకరమని చెప్పారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఇంటర్ స్టేట్ స్థాయిలో ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి వరకు ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కృషి మూడో బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇతర పాఠశాలల కరస్పాండెంట్లు, స్థానిక నాయకులు రవీందర్, రవి, శ్రీనివాస్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కు వినతి

**మార్కాపురం మార్చి 16 (ప్రజాక్షేత్రం)**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పులి శ్రీనివాసులు ను కలిసి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దివ్యాంగుల బ్యాక్లాగ్ పోస్టుల నోటిఫికేషన్‌ను ఆన్‌లైన్ విధానంలో విడుదల చేసి, ఉద్యోగాల భర్తీ కూడా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదర్ వలి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు సంవత్సరాల తర్వాత అర్హులైన దివ్యాంగుల కోసం 14112025న జి.ఓ. ఎంఎస్ నెం.15ను విడుదల చేసి, 31032026 లోపు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో దివ్యాంగుల బ్యాక్లాగ్ పోస్టులను ఆఫ్‌లైన్ విధానంలో భర్తీ చేయడం వల్ల పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని, అర్హులైన దివ్యాంగుల కీలక పత్రాలను తొలగించి అనర్హులకు ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయని దివ్యాంగ సంఘాలు పేర్కొన్నాయని తెలిపారు. అదే విధానాన్ని మళ్లీ అమలు చేస్తారనే ఆందోళన దివ్యాంగుల్లో ఉందన్నారు.



అందువల్ల Rights of Persons with Disabilities Act 2016 ప్రకారం అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగకుండా నోటిఫికేషన్‌ను ఆన్‌లైన్ విధానంలో విడుదల చేసి, ఉద్యోగాల భర్తీ కూడా పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాల ప్రతులను జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రంగస్వామి,ఎం.కృష్ణ,ఎస్.డి. సుభాని,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# చీరాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**చీరాల మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

చీరాల పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. కామధేను కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం రావాలనే లక్ష్యంతో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆయన తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలుగు మాట్లాడే ప్రజల కోసం భాషా ప్రాతిపదికన తొలి రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఆయన ఆత్మార్పణ దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తరతరాలకు గుర్తుండేలా చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మీంచాల సాంబశివరావు, కూటమి నాయకులు, అధికారులు,పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరజీవికి ఘన నివాళులు అర్పించారు.



# రెడ్ క్రాస్ కార్యాలయంలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి ముగింపు వేడుకలు

**చీరాల మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ముగింపు వేడుకలు రెడ్ క్రాస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ బూదరాజు శశి కిరణ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన మద్యపాన నిషేధం కోసం నిరాహార దీక్ష చేసి గ్రామీణ ప్రజల్లో చైతన్యం కలిగించిన గొప్ప నాయకుడని కొనియాడారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ బత్తుల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ "ఆంధ్ర జాతి పిత"గా అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఉపాధ్యక్షురాలు సూరంపల్లి తేజస్వి,కార్యదర్శి జి.ఎ.వి. ప్రసాద్,మేనేజింగ్ కమిటీ సభ్యులు పసుపుల వందనం, తడవర్తి చంద్రశేఖర్,కేబీఎస్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, జీవిత సభ్యులు కాటి రామారావు, ఎస్.పవన్ కుమార్,ఎన్. వెంకటేష్,న్యాయవాది చేబ్రోలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# షాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **షాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎలుగంటి మధుసూదన్ రెడ్డి**

**షాబాద్,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. సోలిపేట గ్రామంలో రూ.40 లక్షల సి.సి రోడ్డుకు శంకుస్థాపన షాబాద్ మండలంలోని సోలిపేట గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న సి.సి రోడ్డుకు ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈసందర్భంగా తెలిపారు. సోలిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం సోలిపేట గ్రామానికి చెందిన గోనె మహేశ్వరికు ప్రభుత్వం తరపున మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. హైతాబాద్ గ్రామంలో రూ.20 లక్షల సి.సి రోడ్డుకు శంకుస్థాపన షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న సి.సి రోడ్డుకు ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. చందనవెల్లి గ్రామంలో రూ.20 లక్షల సి.సి రోడ్ పనుల ప్రారంభం షాబాద్ మండలంలోని చందనవెల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న సి.సి రోడ్డుకు ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. చందనవెల్లి గ్రామంలో చలివేంద్రం ప్రారంభం అదేవిధంగా చందనవెల్లి గ్రామంలో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్,సర్దార్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు రాజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,నవనీత స్వామి, శాంతమ్మ యాదయ్య,స్వరూప మహేందర్ గౌడ్,రాజు నాయక్, చెన్నయ్య,మాణిక్యం,నాయకులు జనార్ధన్ రెడ్డి,నరేందర్,మహేందర్ రెడ్డి,రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్,కృష్ణ,వాసిరెడ్డి,సూర్య, శ్రీనివాస్ గౌడ్,ఖాజా మియా, జాంగిర్,సతీష్, బురాన్,మహేష్, గోపాల్,రమేష్,రాఘవేందర్, ప్రశాంత్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# కామారెడ్డి మున్సిపాలిటీలో ఏసీబీ సోదాలు

**కామారెడ్డి జిల్లా మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మునిసిపాలిటీలో సోమవారం ఉదయం ఏసీబీ నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. అవినీతికి నిలయంగా మారిన కామారెడ్డి మున్సిపాలిటీ అధికారుల తీరుపై గత కొంతకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. ఏసీబీ అధికారులు పక్కా పథకం ప్రకారం గుర్తుపట్టలేని విధంగా ఆ కార్యాలయంలోకి వచ్చి ఏసీబీ అధికారులమని చెప్పడంతో డ్యూటీల్లో ఉన్న అధికారులు షాక్ కు గురయ్యారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్మెంట్ల అనుమతులు, అభివృద్ధి పనుల్లో బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు ఉన్నట్లు పలువురు ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు చేయడం వల్లనే అధికారులు తనిఖీలకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారుల తనిఖీల్లో అవినీతి అధికారుల బిల్లుల చెల్లింపుల బాగోతం బయట పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గత పాలకవర్గం చేసిన అక్రమ బిల్లుల బాగోతం పై ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. కొత్త పాలకవర్గం. ప్రమాణస్వీకారం చేసిన కొద్ది రోజులకే ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలకు రావడం ప్రజా ప్రతినిధుల్లో అలజడి మొదలైనట్లు తేలుస్తుంది. అక్రమాలకు పాల్పడింది అధికారుల,ప్రజాప్రతినిధుల అనేది తేలాల్సి ఉంది. ఏసీబీ అధికారుల తనిఖీలతో అధికారులు ఆందోళనకు గురవుతున్నారు.






# ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు

**కామారెడ్డి జిల్లా మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో నసుల్లాబాద్ మండలం లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం రోజున వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు పరచడంలో విఫలమైనందున వాటిలో క్రింది వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్ఓ కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వాలి.అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలి.నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి ప్రకటించాలి.రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.అర్హులైన పేదలకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి. మహిళలకు 2500 ఇవ్వాలి కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలి బిజెపి మండలం అధ్యక్షులు చందూరి హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ సర్పంచ్ రామ్ గోపాల్ రెడ్డి,ఉపసర్పంచ్ సాయిలు,ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, శేఖర్, అతుకురు సాయిలు,రాందాస్,రవికాంత్,మోహన్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో భక్తి వైభవంగా గోదావరి నదీ హారతి



**భద్రాచలం,మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

భద్రాచలంలో ప్రవహిస్తున్న దివ్యక్షేత్రం పుణ్య గోదావరి నదికి ఏకాదశి ఆదివారం నిర్వహించే గోదావరి నదీహారతి ఎంతో ప్రతిష్టాత్మకమైందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద నిర్వహించిన నదీహారతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీ వాగ్దేవి కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నాదోపాసన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీత కచేరీలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామపంచాయతీ, రెవెన్యూ, దేవాదాయ శాఖల సిబ్బంది, పురోహిత సంఘం సహకారంతో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న గోదావరి హారతిని వీక్షించేందుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. పురోహితులు గణపతి పూజ, అష్టోత్తర శతనామార్చన నిర్వహించి లోకకళ్యాణార్థం ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, సర్పంచ్ పునేం రామకృష్ణ దొర, తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, అధికారులు, పురోహితులు, స్థానికులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ బాంబు దాడులను ఖండించాలి..

- **కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యం కారణంగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్...**
- *** చిగురుమామిడి సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సిలిండర్లతో ధర్నా,రాస్తారోకో...**
- *** పోలీసుల జోక్యంతో రాస్తారోకోను విరమించిన సిపిఐ నాయకులు..**



**చిగురుమామిడి మార్చి 16(ప్రజాక్షేత్రం):**

ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ బాంబు దాడులను కేంద్ర బిజెపి ప్రభుత్వం ఖండించాలని,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి,సీపీఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డిలు తెలిపారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని,గ్యాస్ కృత్రిమ కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ కాళీ సిలిండర్ లతో ధర్నా,రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ బాంబు దాడులను తీవ్రంగా ఖండిస్తూ,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యం వల్ల పెరిగిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్ సరఫరా తగ్గి, ధరలు సామాన్యుడికి భారంగా మారాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ దాడులను తక్షణమే ఆపాలని,యుద్ధ వాతావరణం పేరుతో కేంద్రం పెట్రోలియం ఉత్పత్తులు,గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతుందని మండిపడ్డారు.గ్యాస్ కొరతను నివారించి,పాత ధరలకే సిలిండర్లను అందించాలని డిమాండ్ చేశారు.అంతర్జాతీయ పరిణామాలను అంచనా వేయడంలో కేంద్రం బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ నాయకులు విమర్శించారు.రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా గ్యాస్ గోదాముల వద్ద ప్రజలు క్యూలో ఉంటూ నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హోటల్,హాస్టల్లో గ్యాస్ లేక నానా ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తు చేశారు.యుద్ధలతో ప్రాణ నష్టం జరుగుతుందని,దీంతో సామాన్యుడు పై పెనుబారం పడుతుందని చెప్పారు.సిపిఐ నాయకులు రోడ్డుపై రాస్తారోకో చేయడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.ఎస్సై పృధ్వీధర్ గౌడ్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని సిపిఐ నాయకులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోలి బాపురెడ్డి,మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య,నాయకులు గూడెం లక్ష్మి, అందే చిన్నస్వామి ,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, మావురపు రాజు,గందె కొమురయ్య,కయ్యం తిరుపతి,ఉస్మాన్ పాషా,అనువోజు జనర్ధన్,నేరెళ్ల మొండయ్య,కోతి కనుకయ్య,చందబోయిన కనుకయ్య,మ్యాదరి పోచయ్య, వంగ మల్లయ్య,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జగిత్యాలలో సంచలన పరిణామం...
# కాంగ్రెస్ కు జీవన్ రెడ్డి గుడ్ బై

- **జీవన్ రెడ్డి పిలుపుతో కార్యాలయంలోని కాంగ్రెస్ జెండాలు పీకేసిన అనుచరులు**
- **ఈ నెల 25న బీఆర్ఎస్ లో చేరనున్నట్లు ప్రకటన**
- **40ఏళ్లుగా పార్టీకి అపార సేవలు... వివిధ స్థాయిల్లో పదవులు**
- **రాజకీయంగా పోరాడిన సంజయ్(బీఆర్ఎస్) కాంగ్రెస్ లో చేరడంతో ముదిరిన వివాదం**

**కరీంనగర్ మార్చి 16(ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్ సీనియర్ నేత.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కొంత కాలంగా ఆయన పార్టీలో ప్రాధాన్యత లేకపోవటం.. ఇతర పార్టీ నుంచి వచ్చిన వారు తన నియోజక వర్గంలో పెత్తనం చేయటం పైన అసహనంతో ఉన్న జీవన్ రెడ్డి పార్టీని విడనున్నట్లు తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ జెండా మోసిన ఒక సీనియర్ నేత అయిన తాను ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో కొనసాగలేనని తేల్చి చెప్పారు. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో చేరికకు సిద్ధమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. రాజకీయంగా సంజయ్ కుమార్‌తో పోరాడిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే నాయకుడికి పార్టీలో పెద్దపీట వేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు నుంచి చైర్‌పర్సన్ ఎంపిక వరకు సంజయ్ కుమార్ మాటే చెల్లుబాటు కావడం, జీవన్ రెడ్డి వర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో తనకు అవమానాలు ఎదురవుతున్న పార్టీలో తాను ఉండలేనని పేర్కొన్నారు.



## బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో
# ఏసీబీ సోదాలు

- **డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు**
- **అధికారులకు అందుబాటులో లేని బడంగ్ పేట టౌన్ ప్లానింగ్ ఏసీపీ**
- **జీహెచ్ఎంసీలో విలీనం అయిన తరువాత కూడా నకిలీ బిల్లుల**
- **ఏసీబీ హైదరాబాద్ రేంజ్–2 డీఎస్పీ గంగసాని శ్రీధర్**

**మహేశ్వరం, మార్చ్ 16(ప్రజాక్షేత్రం):** అవినీతి ఆరోపణల నేపథ్యంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. ఏసీబీ హైదరాబాద్ రేంజ్-2 డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భాగంగా శానిటేషన్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన ఫైళ్లు, బిల్లులను అధికారులు పరిశీలిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో కొన్ని పనులు చేయకపోయినా చేసినట్లు చూపించి బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీలో విలీనం అయిన తరువాత కూడా నకిలీ బిల్లుల ద్వారా నిధులు పొందేందుకు ప్రయత్నాలు జరిగాయని ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలిస్తున్నట్లు అన్నారు. శివారు మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే ముందు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ సర్కిల్ కార్యాలయానికి అందుబాటులో లేరని, ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని డిప్యూటీ కమిషనర్ సరస్వతి చేసిన కాల్‌కూ స్పందన రాలేదని ఏసీబీ అధికారులు వెల్లడించారు. సోదాలు పూర్తయిన తరువాత పూర్తి వివరాలు సేకరించి ఆరోపణలపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.







# మహేశ్వరంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగించాలి

- **జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన - మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్**
- **మహేశ్వరం వివిధ గ్రామాల సర్పంచ్లు**



**మహేశ్వరం, మార్చ్ 16(ప్రజాక్షేత్రం):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మండల కేంద్రం అయిన మహేశ్వరం గ్రామ పరిధిలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఊహాగానాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహేశ్వరం, శంషాబాద్ ఇబ్రాహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కలిపి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా ఏర్పాటు చేసి, జిహెచ్ఎంసి పరిధిలోని మంఖాల్ రెవెన్యూ ప్రాంతంలో నిర్మించనున్నట్లు పత్రికలలో వార్తలు వస్తుండటంతో మహేశ్వరం మండల ప్రజలు దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్వరం గ్రామం 1995 సంవత్సరంనుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేంద్రంగా కొనసాగుతూ, నియోజకవర్గ ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేస్తోంది. ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి కూడా అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. ఇటీవల మహేశ్వరం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతూ ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి, రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అదేవిధంగా మహేశ్వరం ప్రాంతం కందుకూరు, కడ్తాల్, ఆమంగల్ ప్రాంతాలకు మధ్యస్థంగా ఉండటంతో ఆ ప్రాంతాల ప్రజలు కూడా ఇక్కడే సులభంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించుకుంటున్నారు. ఒకవేళ ఈ కార్యాలయాన్ని జిహెచ్ఎంసి పరిధిలోకి తరలిస్తే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు, సమయం ఇతర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో మహేశ్వరం మండల ప్రజలు తమ వినతిని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ అధికారులకు తెలియజేశారు. అనంతరం అధికారులు మహేశ్వరం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 71లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఆర్ డి ఓ కూడా ఆ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించినట్లు తెలిసింది. మహేశ్వరం మండల కేంద్రంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలని మహేశ్వరం మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల సర్పంచులంతా కలిసి కలెక్టర్ కి వినతి పత్రం ఇయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవుళ్ళ నాయక్, పద్మ కృష్ణ , జగదీష్, శంకరయ్య, జ్యోతి కుమార్ నాయక్, జయమ్మ కృష్ణ , పోతుళ్ళ మల్లమ్మ , క్రిష్ణవేణి శ్రీనివాస్,మొతిలాల్ జ్యోతి సిల్వారెడ్డి, లక్ష్మమ్మ,చంద్రయ్య, అంబయ్య, పాండు యదవ్, వెంకటవీర్ రెడ్డి, చంద్రశంకర్ రెడ్డి జోమల రమేష్, హనుమంతు, రాజు నాయక్ , రవి,దుడ్డి కృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం, గొంతుకోసి హత్య

**రాజేంద్రనగర్, మార్చి 16(ప్రజాక్షేత్రం):** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ క్యాంపులో నివసించే ఒక వలస కూలీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన నాలుగేళ్ల చిన్నారిని ఓ కామాంధుడు పొట్టనబెట్టుకున్నాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, అత్యంత క్రూరంగా గొంతుకోసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నార్సింగి పరిధిలోని వివిధ నిర్మాణ రంగ పనుల కోసం ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులు ఇక్కడి లేబర్ క్యాంపుల్లో నివసిస్తున్నారు. తమ పిల్లలను క్యాంపుల్లో వదిలి తల్లిదండ్రులు పనులకు వెళ్తుంటారు. ఈ క్రమంలోనే మార్చి 15వ తేదీన ఒక కూలీ కుటుంబానికి చెందిన నాలుగేళ్ల బాలిక కనిపించకుండా పోయింది. కంగారుపడిన తండ్రి అదే రోజు రాత్రి 12:30 గంటల సమయంలో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సిసిటివి ఆధారాలతో నిందితుడి గుర్తింపు**

దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనా స్థలంలోని ఆధారాలు, సీసీటీవీ విజువల్స్ పరిశీలించి నిందితుడిని గుర్తించారు. నిందితుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, మాల్దా జిల్లాకు చెందిన విశ్వాస్ హోరా (20) గా గుర్తించారు. ఇతను ఉప్పలగూడలోని వెస్ట్రన్ కన్స్ట్రక్షన్ లేబర్ కాలనీలో నివాసం ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఒళ్ళు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయి. ఒంటరిగా ఉన్న బాలికను అపహరించి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. తన నేరం బయటపడుతుందనే భయంతో బాలిక మెడను గొంతుకోసి చంపేసినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడు చూపిన సమాచారం మేరకు సమీపంలోని పొదల మధ్య పడి ఉన్న బాలిక మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుడి అరెస్ట్**

పోలీసులు నిందితుడిపై హత్య, అత్యాచారంతో పాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసామని పోలీసులు తెలియజేశారు.




## జాతీయ స్థాయి కరాటే పోటీలు
# రిత్విక్ రాజ్ ప్రథమ స్థానం

**శంకర్ పల్లి, మార్చి 16(ప్రజాక్షేత్రం):** సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో ఈ నెల 14, 15 తేదీలలో 'నిహాన్ షోటోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ' జాతీయ స్థాయి కరాటే పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. శంకర్ పల్లి కి చెందిన రిత్విక్ రాజ్ మొదటి విజేతగా నిలిచారు. పాయింట్ల ఆధారంగా 217 పాయింట్లతో తెలంగాణ మొదటి స్థానం, 116 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానం, 76 పాయింట్లతో మూడవ స్థానం సాధించాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగి విజయవంతంగా ముగిశాయి.




## గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలో మేడలే'..
# క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరు

- **బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం!**
- **ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకే రేవంత్ సర్కార్ కుట్ర**
- **తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**

**మహేశ్వరం, మార్చి 16(ప్రజాక్షేత్రం):** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం ఎంత మాత్రమూ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితమ్మ తెలిపనట్టుగా బతుకమ్మ సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలని చూడడం. కుదరకపోతే వక్రీకరించాలని చూడడం. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులు ఇవే. నేడు తెలంగాణలో నూటికి 90 మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్నది. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపాలి అనే అల్పసంతోషం తప్ప ఇది మరొకటి కాదు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా గారు చేసిన ప్రసంగం పట్ల తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని జాగృతి నాయకుడు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులకు విడుదల చేసిన ప్రకటన ప్రసంగంలోని డొల్లతనం పచ్చి నిజాలు: 2047 లక్ష్యం..నేటి సంక్షోభం ఎవరికి కావాలి?: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదు. భవిష్యత్తు గురించి ఊహాచిత్రాలు గీస్తూ, నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారు.జీహెచ్ఎంసీ విభజన పరిపాలనా సౌలభ్యమా? రాజకీయ స్వార్థమా?: హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తూ జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం వెనుక గల అసలు ఉద్దేశం రాజకీయ ఆధిపత్యమే తప్ప ప్రజల సౌకర్యం కాదు. దీని వల్ల సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు, కేవలం అధికారుల సంఖ్య, ఖర్చు పెరుగుతుంది. మూసీ ప్రక్షాళన పేదల వెలివేత: మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు కానీ, దాని వల్ల నిరాశ్రయులవుతున్న వేలాది పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి అంటే.. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమా? ఇక రైతు భరోసా క్షేత్రస్థాయిలో అన్యాయం: 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇంకా ఎంతమంది కౌలు రైతులు, సామాన్య రైతులు సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారో పట్టించుకోవడం లేదు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్లు ఆచరణ సాధ్యమేనా?: 4 లక్షల ఇళ్ల నిర్మాణం అని చెబుతున్న ప్రభుత్వం, గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు? కొత్త ఇళ్ల మంజూరు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు సామాన్యుడికి దూరం: వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల ముచ్చట దశాబ్దాలుగా వింటున్నదే. ఇవన్నీ ఎన్నికల తాయిలాలుగానే కనిపిస్తున్నాయి తప్ప, సామాన్యుడి రవాణా కష్టాలను తీర్చేవి కావు. "ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది. పరిష్కారం చూపని 47 వేల పిటిషన్ల గణాంకాలు దేనికి సంకేతం? ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఈ ప్రసంగం ఉంది. 'జాగృతి' తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుంది. అని పాండురంగారెడ్డి అన్నారు.





## ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీల అమలుపై స్థానిక సబ్ కు తాసిల్దార్ వినతి పత్రం అందజేత

**కామారెడ్డి జిల్లా మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో కేంద్రంలో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షుల పిలుపు మేరకు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీల అమలుపై స్థానిక సబ్ తాసిల్దార్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ..మొదటగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో జమ చేయాలని కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని వృద్ధులకు వికలాంగులకు 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని మహిళలకు 2500 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆటో డ్రైవర్లకు కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తారని అదేవిధంగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తి కానందున ఇట్టి హామీలను అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో సబ్ తాసిల్దార్ వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చిదుర సాయిలు జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ బాన్సువాడ మున్సిపాలిటీ కౌన్సిలర్ గజ్జల మహేష్ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఉమేష్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్చపల్లి సాయి రెడ్డి బిజెపి నాయకులు పాశం భాస్కర్ రెడ్డి చీకట్ల రాజు కొండని గంగారం చాకలి మహేష్ ర్యాల విట్టల్ రెడ్డి నసూల్లాబాద్ మండల అధ్యక్షులు హనుమాన్లు నెమలి సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

- **ప్రజావాణి లో119 దరఖాస్తులు స్వీకరణ**

**వికారాబాద్ జిల్లా మార్చి 16 (ప్రజాక్షేత్రం):**

ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,ట్రైనీ కలెక్టర్ హార్స్ చౌదరి జడ్.పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపరాభవనామ ఉగాది వేడుకల్లో సేవారత్న అవార్డుల ప్రదానం

**కామారెడ్డి జిల్లా మార్చి 16 (ప్రజాక్షేత్రం)**

హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో 2026 శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్య చేతుల మీదుగా సమాజ సేవకులకు సేవారత్న అవార్డులు అందజేశారు.కామారెడ్డి జిల్లా,బాన్సువాడకు చెందిన రుద్రంగి గంగాధర్ గుప్తాకు కూడా ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. మొత్తం 536 దరఖాస్తులు రాగా,కేవలం 25 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు.






## అభివృద్ధి పనులకు భూ కేటాయింపు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి :జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మార్చి 16(ప్రజా-క్షేత్రం):**


జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా అమలుకావాలంటే అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూమి కేటాయింపు,భూమి అవసరాల అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలులో ఉన్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఆయా శాఖల ద్వారా మంజూరైన పనుల వివరాలు,వాటి ప్రస్తుత పురోగతి, ఎప్పుడు మంజూరు అయ్యాయి, ఇప్పటివరకు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అలాగే ఏ పథకం కింద పనులకు మంజూరు లభించింది,పనుల అమలుకు ఎంత భూమి అవసరం ఉంది, భూమి కేటాయింపులో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు భూమి సమస్యల కారణంగా ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన భూమి గుర్తింపు,కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసి పనులు త్వరగా ప్రారంభం కావడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.భూమి కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి వివరాలతో సమర్పించి,పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖలు తమ శాఖల పరిధిలో అమలులో ఉన్న పనులపై సమగ్ర సమాచారం సేకరించి, మంజూరైన పనులు, వాటి పురోగతి,భూమి అవసరాలు,పెండింగ్‌కు కారణాలు వంటి అంశాలను వివరంగా పొందుపరుస్తూ నివేదికలను సిద్ధం చేసి జిల్లా పరిపాలనకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు త్వరగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, బీసీ సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి,ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్ రావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ రావు,జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత,ఇల్లందు, అశ్వరావుపేట,మణుగూరు మున్సిపల్ కమిషనర్ లు జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, విద్యుత్,వ్యవసాయ,అటవీ, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




## మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జోగులాంబ గద్వాల జిల్లా ఆధ్వర్యంలో ప్రకృతి దర్శన కార్యక్రమం

**జోగులాంబ గద్వాల జిల్ల,మార్చి 16(ప్రజాక్షేత్రం):**


మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రకృతి దర్శన కార్యక్రమమాన్ని జిల్లా మాజీ అధ్యక్షుని ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ ప్రకృతి దర్శన కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లందరితో పరిచయ కార్యక్రమం,గద్వాల జిల్లాలో ఉన్న సామాజిక _రాజకీయ _ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించడం, మూఢనమ్మకాల నిర్మూలన కోసం ఈ గద్వాల జిల్లాలో ఎటువంటి కార్యక్రమాలు చేయాలి, ఏమేం చేయాలనే విషయాలపైన సుదీర్ఘంగా చర్చించడం మరియు కాన్షీరామ్ జయంతి ఉత్సవాన్ని చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మొదలు పెడితే సాయంత్రం 5 గంటల వరకు ప్రకృతి దర్శన కార్యక్రమం ఏం ఎన్ ఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠం వచ్చి మాట్లాడుతూ గద్వాల జిల్లాలో ఉన్న మూఢనమ్మకాల పైన సుదీర్ఘంగా ప్రసంగించారు.అదేవిధంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎదుల నాగరాజు మాట్లాడుతూ ఈ జిల్లాలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘాన్ని ఎలా బలోపేతం చేయాలో చెప్పడం జరిగింది. రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లవి మాట్లాడుతూ కాన్షీరామ్ జయంతి సందర్భంగా అతని త్యాగాలను వచ్చిన వారికి తెలియజేయడం జరిగింది. ఇక్కడే ఉంటున్న గద్వాల్ జిల్లా యువకుడు శరణప్ప సభ అధ్యక్షత వహించి ఎంతో చక్కగా ఈ ప్రకృతి దర్శన కార్యక్రమాన్ని నడిపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు పెరుగు గౌతమ్,జాతీయ యూత్ ప్రధాన కార్యదర్శి గోమాస సందీప్ గారు, ఏం ఎన్ ఎస్ నాయకులు రమేష్, నయీం,అశోకు,సుధాకర్ మరియు ఇతరులు పాల్గొని ప్రకృతి దర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## దోమల బెడదపై చర్యలు తీసుకోవాలి

**కీసర,మార్చి 16(ప్రజాక్షేత్రం):**

కీసర సర్కిల్ పరిధిలోని కీసర ఉమ్మడి గ్రామంతో పాటు అంకిరెడ్డిపల్లి, చీర్యాల, యాద్గర్‌పల్లి, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో పెరిగిన దోమల సమస్యను వెంటనే అరికట్టాలని మాజీ వార్డు సభ్యుడు తుడుం శ్రీనివాస్ కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల తరపున డిప్యూటీ కమిషనర్ వసంతకు వినతిపత్రం సమర్పించారు. ఫాగింగ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఫాగింగ్ చేపట్టి కాలువలు, చెత్త నిల్వలు శుభ్రపరచి దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.




## తాళ్లపల్లి పారిశుద్ధ కార్మికులను శాలువాలతో ఘన సన్మానం.

- **సన్మానించిన తాళ్లపల్లి సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్య గౌడ్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 16(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం తాళ్లపల్లి పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్య గౌడ్, ఉప సర్పంచ్, అక్కముల అంజయ్య, మరియు పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులను ఘనంగా సన్మానించారు, అనంతరం తాళ్లపల్లి సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పారిశుద్ధ కార్మికుల పాత్ర చాలా కీలకమైనదని కొనియాడారు. అదేవిధంగా పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్యపరమైన జబ్బులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా వారికి సబ్బులు, బ్లౌజెస్, మరియు మాస్కులు అందజేశారు, ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి గ్రామ పెద్దలు యువకులు, తదితరులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మణికొండలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**రాజేంద్రనగర్, మార్చి 16(ప్రజాక్షేత్రం):**

జిహెచ్ఎంసి సర్కిల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మణికొండలో అవోపా ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం నేర్పరుస్తున్నారని, మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పొట్టి శ్రీరాములు పేరును మార్చి తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం జరిగిందని, సురవరం ప్రతాపరెడ్డి అంటే అందరికీ అభిమానం ఉందని కావున వారి పేరు నువేరే ఇంకెక్కడనైనా సూచించాలని కోరుతూ తెలుగు యూనివర్సిటీకి మాత్రం పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేశారు. ఆర్యవైశ్యులలో స్వలాభం కొరకు కాకుండా, సమాజం మేలుకోరి త్యాగం చేసిన గొప్ప మహానుభావులు ఉన్నారని, నిస్వార్థంతో పనిచేస్తూ వారి కుటుంబ సంక్షేమం గురించి ఆలోచించకుండా ఏమీ ఆశించకుండా ఇప్పటివరకు కూడా సమాజం కోసం పనిచేస్తున్న వారు ఉన్నారని చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ గండిపేట మండలం అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి నవీన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సాయిరాం, పుప్పల గూడ అధ్యక్షుడు వేణు మాధవ్, శ్రావణ్, ప్రణీత్, మూర్తి, మణికొండ మహిళా విభాగం కార్యదర్శి మహాలక్ష్మి, కోశాధికారి దేవి ప్రియ, మానస సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.in, PRGI NO. TGTEL/26/A2094